ఆ తర్వాత... నాన్నమ్మ అయితే దాదాపుగా మంచం పట్టేసినట్లయిపోయింది. అమ్మ మాత్రం మనసులోనే మేటవేసిన మౌనవేదనని పైకి కనబడనీయకుండా దాచుకుని నిబ్బరంగా కనపడటానికి ప్రయత్నిస్తోందనిపించింది! నాన్నమ్మ కుప్పకూలినట్లుగా అయిపోవటంతో, మరి అమ్మ మీదే అందర్నీ, ఇంటిపనుల్నీ చూసుకోవాల్సిన బాధ్యత అమ్మ మీదే పడింది కదా!

ఆ కష్టసమయంలో, ఊళ్ళోని వాళ్ళేకాదు, మా పాలేర్లందరూ కూడా ఇంటివాళ్ళలాగే అండగా నిలబడి పనులు చక్కబెట్టారు!

అందుకే కదా మన పెద్దవాళ్ళు చెబుతూంటారు.... కష్టం అయినా సుఖంలో అయినా పాలు పంచుకోవటానికి నలుగురు ఆత్మీయులుండాలని! ఆ మాటెంత నిజమో నాకు అనుభవ పూర్వకంగా అర్థమైంది.

ఏదో ఇంట్లో కాసేపు అమ్మకి సాయంగా ఉండగలుగుతున్నాను గానీ, మిగతా సమయం అంతా నరసింహమూర్తిగారింట్లోనే గడిచిపోతోంది. 'పనులు చూసుకోవటానికి ఇంత మందిమి ఉన్నాంగా, నువ్వెళ్ళరా...' అంటూ అమ్మ నరసింహమూర్తిగారింటికి పంపించేస్తోంది!

అక్కడికి రోజంతా ఎవరెవరో వస్తూ... ఏవేవో సమస్యలు వివరిస్తూ ఉంటారు. నియోజక అభివృద్ధికి ఏం చేయాలో... ఎలా చేయవచ్చో... రకరకాలుగా సమాలోచనలు

జరుగుతూంటాయి. అందరి అభిప్రాయాలూ వింటూ నేనూ రాజకీయ పరిజ్ఞానాన్ని పెంచుకోగలుగుతున్నాను!

అసలు నరసింహమూర్తిగారింటిలోని పుస్తకాలన్నీ చదవటం మొదలు పెట్టినప్పటి నుండి నా ఆలోచనా పరిధి పెరిగినట్లూ, ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లూ అనిపించేది! మూర్తిగారికి తీరుబడి ఉన్నప్పుడు...ఆ పుస్తకాల్లోని విషయాల గురించి చర్చించటం ద్వారా విజ్ఞానం విస్తృతమైన భావనా కలుగుతూండేది!

నాకు తెలియకుండానే భాషలోనూ మార్పు వచ్చింది. అనర్గళంగా మాట్లాడగలిగే నేర్పూ అలవడింది! ఇదంతా... నరసింహంగారి అనుచరుడిగా నేను పొందిన గుర్తింపు మాత్రమే! అంతమాత్రానికే, పదవుల్ని అందుకోగలిగేంత అర్హత సంపాదించానని నేననుకోను! నావి తొలి తప్పటడుగులు మాత్రమే... పరుగు పెట్టగలవాడే పదవులకి అర్హుడవగలడు!

నరసింహంగారు సాధారణంగా సాయంకాలాలు వ్యాహ్యాళికి వెళ్ళినట్లుగా ఊళ్ళోకి బయలుదేరతారు. రోజూ ఓ రెండు మూడు వీధులైనా నడుస్తారు. దారిలో ఎవరైనా కూడా కలిసి వెంట నడుస్తూ మాటలు కలుపుతూ... సమస్యలేమైనా ఉంటే... విన్నవించుకుంటున్నట్లు చెప్పుకోవటమూ జరుగుతూంటుంది! అలాంటపుడు ఆయన ఏం చేస్తే బావుంటుందీ అని వాళ్ళనీ సంప్రదిస్తున్నట్లుగా సలహాలను తీసుకుని... అందరం కలిసి పరిష్కారానికి పనిచేద్దామని చెప్పటం... నేను విన్నాను. ఆ తర్వాత నరసింహంగారే తన స్వంత డబ్బు ఖర్చు చేసి ఆ పని పూర్తి చేసినా సరే, ఆ విషయం ఎక్కడా ప్రస్తావించకపోవటమూ చూశాను!

నరసింహంగారి తాతగారికున్న పేరు, రాజకీయ పలుకుబడిని బట్టి తమ అభ్యర్థిగా పార్టీ నిర్ణయించటం జరిగింది. మా ఊరులోనే కాదు, ఆ చుట్టుపక్కల ఊళ్ళ జనం కూడా ఆయన వల్ల ఎన్నో ఉపకారాలు పొందినవాళ్ళే! అందుకే వాళ్ళ కుటుంబానికి ఉన్న పేరు, ప్రతిష్ఠల్ని దృష్టిలో పెట్టుకుని, ఇంకెవరూ పోటీకి నిలబడరనీ, ఎన్నిక ఏకగ్రీవమేననే ఆలోచనలో అంతా ఉండగా, అనుకోని మలుపు వచ్చింది.

అతని ధైర్యానికి చాలామంది విస్తుపోయారు. మరికొంతమంది నరసింహ మూర్తిగారికి పోటీగా నిలబడేంత అర్హత నీకుందా అంటూ అతని మొహంమీదే ఛీత్కరించారనీ అనుకోవటం విన్నాను. ఈ మాటలు పూర్తి నిజం కాకపోవచ్చనీ, పుకారే అయివుంటుందనీ కొంతమంది అన్నారు. ఆ మాట నిజమేనని నేనూ అనుకున్నా.

అయితే, ఆ మాట వదంతి కాదని ఆ రోజు సాయంకాలం తెలిసివచ్చింది! నరసింహమూర్తి గారితో మేం ఓ నలుగురం ఊళ్ళో తిరుగుతున్నప్పుడు... నారయ్యా నలుగురితో కలిసి మాకు ఎదురు పడ్డాడు.

మేం కొంచెం దగ్గరకు రాగానే వ్యంగ్యంగా చిరునవ్వు చిందిస్తూ మీసం మెలేసినట్లుగా సవరించుకుని ' దొరల కాలం పోయి... పాలేర్ల రాజ్యం వస్తోందని...' బోర విరుచుకుని తిరుగుతున్న ఈ పెద్ద మనుష్యులకు ఎప్పటికి అర్థమౌతుందో...!' అన్నాడు.

నరసింహంగారు ఆ మాటల్ని విన్నా పట్టించుకోనట్లు ప్రశాంతంగానే అడుగు ముందుకు వేశారు. అయితే పక్కనే ఉన్నాయన మాత్రం ఆవేశంతో వూగిపోతూ 'వీడికెంత పొగరో చూడండి... నాలుగు డబ్బులు కూడబెట్టగలిగినంత మాత్రాన పెద్దమనిషినైయిపోయానను కుంటున్నాడా.. మీకు సాటి కాగలడా ఎన్ని జన్మలెత్తినా...' అని అతని మీదకు ఉరకటానికి సిద్ధపడిపోయాడు!

నరసింహంగారే శాంతమూర్తిలా అతన్ని అనునయించి చల్లబరిచారు. 'అలా అనుకోవటం వలన అతనకి ఆనందం కలిగితే, మనమెందుకు అడ్డం పడటం... అలాగే అనుకోనిస్తే, మనకు నష్టం ఏం ఉందీ...!' అని వూరుకున్నారు.

ఆశ్చర్యంగా అనిపించింది!

తరువాత రెండు రోజులకే నారయ్య ఉండే వీధిలోకి మళ్ళుతోంటే... ఇటెక్కడికని నేనడిగా చిరునవ్వుతో 'ఈ వీధిలో నారయ్య ఉన్నంతమాత్రాన మన ఊరి ప్రాంతం కాకపోతుందా...? మరి... నువ్వెందుకు అంత ఆశ్చర్యపోతున్నావ్... మనం ఇలా అన్ని

నారయ్య ఎదురుపడితే, పొగరు చూపిస్తూ మళ్ళీ ఎలాంటి వేషాలేస్తాడోననేది నా ఆలోచన!

సరిగా నేననుకున్నట్లే... మేం ఆ వీధిలోకి వెళ్ళేసరికి నారయ్య తన ఇంటి ముందున్న అరుగు మీద కూర్చుని ఎవరితోనో కబుర్లు చెబుతున్నాడు.

నరసింహంగారు వాళ్ళింటి ముందు ఆగగానే అప్రయత్నంగానే  లేచి నిలబడ్డాడు. నరసింహంగారు తన ఎదురుగా నిలబడి వున్న నారయ్యతో చనువుగా 'ఏంటి నారయ్యా నువ్వూ అభ్యర్థిగా నిలబడాలనుకుంటున్నావట...?' అనడిగారు.

'అవును... ఎందుకు కూడదూ... ఎప్పుడూ మీ వాళ్ళే పరిపాలించాలా...?' చాలా దురుసుగా విసురుగా అన్నాడు.

నరసింహంగారు మాత్రం ప్రశాంతంగా జవాబిచ్చారు.

'అవును నారయ్యా... నువ్వన్నది నిజమే. నీ మాటని నేనూ ఒప్పుకుంటాను. అందుకే, నేనొకటి ఆలోచించాను. మనం ఎవరమైనా ఊరి ప్రజలకు ప్రయోజనం కలిగించే పనులు చేయాలనేగా. సేవ చేస్తామంటూ వచ్చే వాళ్ళని స్వాగతించాలి గానీ పోటీ అంటూ ప్రతి ఘటించటం ఎందుకూ అనిపించింది! నిజమేగా... అందుకే నువ్వే ఆ శ్రమ తీసుకుంటానని ముందుకు వస్తే... నేను నిరభ్యంతరంగా తప్పుకుంటాను! ఎన్నిక ఏకగ్రీవమైతే... శ్రమే కాదు, చాలా అనవసరమైన ఖర్చూ తగ్గుతుంది...! అవునా...?

అందుకే... నేనో సలహా ఇవ్వాలనుకుంటున్నాను. నువ్వు ఇప్పుడిపుడే కొంచెం ఆర్థికంగా కుదురుకున్నావు... ఎన్నికలో నిలబడి, గెలవటానికని సంపాదించుకున్న ఆస్తిలో చాలావరకూ ఖర్చు చేయాల్సి వస్తుంది! ఎందుకు వచ్చిన దుబారా ఇదంతా చెప్పూ...!

ఎన్నికలకని మనం ఖర్చు పెట్టాలనుకున్న డబ్బును ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుతో కలిపి మన ఊళ్ళో అవసరమైన పనులకు ఓ నిధిలా ఏర్పాటుచేసుకుని ఖర్చుచేస్తే బావుంటుంది కదా... ఏమంటావు నారయ్యా... నేను పోటీకి భయపడి పౌరుషం లేక అనుకోకు. మన

రోడ్డున పడొద్దని మేవు మొత్తుకుంటుంటే... సెవిని పెట్టటంలేదు... మీరయినా గడ్డి పెట్టండి...!' అని కళ్ళుతుడుచుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది.

ఆ రోజు నాకన్నీ ఆశ్చర్యాలే...!

ఆమె పరుగున వస్తోంటే... తగువు పెట్టుకోవటానికి అనుకున్నా. అలా మాట్లాడు తుందని ఊహించలేకపోయా. సహజంగా సొంతవాళ్ళయేసరికి వాళ్ళ తప్పులు వాళ్ళకి కనిపించవు!

నాకప్పుడు అనిపించింది... ఆమెది చాలా గొప్ప మనసని!

నరసింహంగారు అలా స్థాణువులా నిలబడిపోయిన నారయ్య భుజం తట్టి 'తొందరేం లేదు నారయ్యా... మన కుటుంబాల క్షేమం, ఊరి ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, నాకు వచ్చిన ఆలోచనను నీతో పంచుకుంటున్నాను. నువ్వూ ఆలోచించి ఏం చేద్దామంటే... అది నాకూ చెప్పు.

ఇంకొకటి. నేనో మాట విన్నాను. ఎప్పుడో మా తాతయ్య మీ తాతని ఏదో అన్నాడనే విషయాన్ని మనసులో పెట్టుకుని బాధపడుతున్నావని. నిజమేనా...?

పెద్దవాళ్ళకి ఆరోజుల్లో... వెధవా, కాళ్ళిరగగొడతా... వీపు చీరేస్తా లాంటి మాటలు... వాడటం చాలా మామూలు విషయం. పిల్లలు కూడా కొంచెం భయం చూపిస్తారేమోగానీ బాధపడరు! మా తాతయ్య కూడా చనువుగా ఇంట్లో మనిషిలా భావించి మీ తాతని అలా మందలించి ఉండొచ్చు. అలా ఆలోచిస్తే మనకు తప్పుగా ఉండదు. అవునా...?

అలా కాకుండా దొరతనం చూపించటం, దౌర్జన్యం చేయటం మాత్రం తప్పే. పనులు పురమాయించేటప్పుడు ప్రేమను చూపించాలి... తప్పు చేశారనిపిస్తే దండిరచటమూ అవసరమే! అయినా అప్పుడు... ఏ పరిస్థితుల్లో ఏం జరిగిందన్నది మన ఇద్దరికీ పూర్తిగా తెలియదు. అయినా ఆ జ్ఞాపకాల వల్ల నీ మనసుకు బాధ కలిగితే... ఇపుడు నేను చేయగలిగిందల్లా క్షమాపణ కోరటమే...! మన పెద్దల ప్రవర్తన, మాటల్లోని సంస్కారాన్ని మనం అందిపుచ్చు

వాళ్ళు పురెక్కించి పోటీకి దిగమంటే... నిజంగానే గొప్పోడిననుకుని మురిసిపోయాడంతేనండీ...

ఇప్పుడు... కొంచెం తెలివి తెచ్చుకున్నాడు. బాగుపడతాడు. నారయ్య అమ్మ మీకు దండాలని సెప్పమంది...!' అంటూ చివరగా 'సత్తా సంపాయించాక కదండీ, బరలోకి దిగాలీ' అంటూ ముగించాడు.

అతను ఎంత బాగా చెప్పాడూ అనుకున్నాను.

' చేవలేనిదే పదవి యావ' మాత్రం ఎందుకూ... అది నిజమేగా... దేనికైనా సమర్థతే ముఖ్యం! జాతి గొడవ లేకుండా సమర్ధత సాధించే దిశగా అందరూ శ్రమించాలి.

నారయ్య దగ్గరనుండి అలాంటి కబురు రావటం కూడా నేనూహించనిదే! అలాంటి నిర్ణయం తీసుకోవటంలో అతని తల్లి పాత్ర కూడా ఉండివుంటుందనుకున్నాను!

నారయ్యలో అటువంటి మార్పు నరసింహంగారు యుద్ధం చేయకుండా సాధించిన గెలుపులా అనిపించింది.... ఇది కదా అసలైన విజయమంటే అనుకున్నాను!

నా ఆలోచనను నరసంహంగారు పసిగట్టారేమో తెలియదుగానీ, తర్వాత అన్నారు.

'ఏదైనా జరిగితే... అందులో మన ప్రతాపమే ఫలించిందని అనుకోవటం... పూర్తి నిజం కాదు! అవతలి వ్యక్తిలోనూ వివేకం, విజ్ఞత ఉంటేనే మన ప్రయత్నమూ ఫలిస్తుంది! లేకపోతే వికటిస్తుంది...!'

అదీ నిజమేననిపించింది.

ఇలా ఊరి విషయాల్లో ఎంత తలమునకలుగా ఉన్నా, ఇంటి విషయాలను పట్టించుకోవటంలోనూ జాగ్రత్తగానే ఉన్నా. నరసంహంగారు కూడా వ్యాపారం గురించి, ఇంట్లో వాళ్ళ గురించీ పదే పదే వాకబు చేస్తూ, నేనూ వాటిపట్ల అప్రమత్తంగా ఉండేలా చూస్తున్నారనిపించింది!

ఆరోజు.... నేను మామూలుగానే నరసంహంగారింటిలో ఉన్న సమయంలో ఒక పెద్దాయన వచ్చారు. ఆయన వెంట పదిమంది అనుచరగణం ఉంది. రెండు పెద్ద పెద్ద

లేదనీ, పెట్టుబడి పెట్టకుండా, శ్రమలో పాలు పంచుకోకుండా ఆదాయంలో భాగం తీసుకోవటమనేది తనకస్సలు నచ్చని వ్యవహారమంటూ ఆయన ప్రతిపాదనను సున్నితంగానే తిరస్కరించారు నరసింహంగారు.

తర్వాత ఆయన బయలుదేరుతున్నప్పుడు ఆయన బండిలో పళ్ళ బుట్టల్ని పెట్టించి, అదనంగా 'తోటలోవి' అంటూ ఇంకో పళ్ళబుట్టనూ చేర్చారు.

'మీరు తెచ్చిన వాటిలో సరిపడా తీయించాను... ఇక్కడ ఇంట్లో తినేవాళ్ళూ, తినగలిగన వాళ్ళూ ఎక్కువమంది లేరు. మీ దగ్గిర మందీ మార్బలం ఎక్కువ కాబట్టి ఎన్నైనా చెల్లుబాటు అవుతాయనే ఉద్దేశ్యంతో మావీ కలిపి పెట్టాను. మీక్కూడా వచ్చినవాళ్ళు తలా కాసిని తీసుకున్నా సరిపోతాయి...! అంటూ ఆయన నొచ్చుకోకుండా నచ్చచెప్పే ప్రయత్నమూ చేశారు నరసింహం గారు.

నిజాయితీకి నిలువెత్తు నమూనాలాంటి నరసింహమూర్తిగారి శిష్యరికంలో నాలోనూ విలువలబలమైన పునాది ఏర్పడిరది.

***

మా నియోజకవర్గ అభ్యర్థిగా నరసింహంగారి గెలుపు ప్రకటించబడిన కొన్నాళ్ళకి.... నరసింహంగారి శ్రీమతి మా ఊరుకి వచ్చారు.

చాలా ఉత్సాహంగా కనిపించారు. నవ్వు మొహంతో 'ఈ ఊరుతో మీకున్న బంధాన్నీ, సంకెళ్ళనీ విడిపించి వెంటబెట్టుకుని వెళ్ళటానికి వచ్చాను...' అన్నారు.

ఆ మాటలకు అర్థం ఏమిటో తర్వాత తెలిసింది.

శుభ తండ్రిగారికి ప్రభుత్వ పెద్దలతో ఉన్న పరిచయం వలన నరసింహమూర్తిగారికి మంత్రి పదవి దక్కబోతోందనే సమాచారం కొంచెం ముందుగానే తెలిసిందట!

నరసింహంగారిలో కొద్దిపాటి ఆశ్చర్యమే తప్ప అంతగా ఆనందం కనుపించలేదు! ఆవార్త నిజమైతే ఏం చేయాలో అన్న ఆలోచనలో ఉన్నారనిపించింది.

మా ఊరివాళ్ళలోనైతే ఉత్సాహం వెల్లువైంది! జనం రాకపోకలతో ఒకటే సందడీ, సంబరం! నాకూ ఉత్సాహంగానే ఉంది! నరసింహమూర్తిగారిలోనే ఏదో ఉక్కబోత కనిపిస్తోంది!

'మంత్రి పదవంటే... మీకేమీ తెలిసినట్లు లేదే..! ఏదో బరువు నెత్తిమీద పడినట్లుగా ఎందుకలా కనిపిస్తున్నారు...?' అంటూ శుభగారు విరుచుకుపడ్డారు.

అప్పటికి ఏమీ సమాధానం చెప్పకుండా మూర్తిగారు నిశ్శబ్దంగా ఉండిపోయారుగానీ, తర్వాతొకసారి నాతో చెప్పారు.

'ఆవిడగారికి... మంత్రిపదవంటే... పదిమంది మనుష్యులు, సౌకర్యాలు, హంగు, ఆర్భాటం...! అలాంటి హోదా ఆమెకి ఆనందం... నాకేమో అర్హత గురించి ఆందోళన ! మా తాతగారి పలుకుబడి పనిచేసి నన్నీ పదవి వరించిందిగానీ... వ్యక్తిగతంగా నిర్వహించగలిగే సామర్థ్యం ఉందా అనే అనుమానం! అందుకే అస్థిమితంగా ఉంది. నిజంగానే నా తలమీద నేను మోయలేనంత బరువు పడిరదేమోనని కొంచెం గాబరాగానూ ఉంది...!'

'కేవలం మీ తాతగారి పలుకుబడితోనే ఈ పదవి వచ్చిందనుకోవటానికీ వీల్లేదండి. మీకు మన ఊరిలోనూ, చుట్టుపక్కల ఊళ్ళలోనూ ఉన్న మంచి పేరును బట్టే ఈ నిర్ణయం జరిగిందని అనుకుంటున్నా. మీ చదువు కూడా మీకా అర్హత ఉందని నిరూపించి వుంటుంది! మీరు ఆ పదవికే వన్నె తీసుకురాగలరని నా నమ్మకం....!' అన్నాను.

ఆయన నవ్వి 'నీ అభిమానం నీతో అలానే మాట్లాడిస్తుందని నాకు తెలుసు. చూద్దాం...!' అన్నారు.

నరసింహంగారు పట్నానికి మకాం మార్చే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే నాన్నమ్మ మమ్మల్ని విడిచి వెళ్ళిపోయింది.

నాన్నమ్మతో నాకున్న అనుబంధంకొద్దీ ఆ దుఃఖాన్ని తట్టుకోవటం కష్టంగానే అనిపించినా... అది సహజ పరిణామమే అని తొందరలోనే సరిపెట్టుకుని స్థిమితపడ్డాను. నరసింహంగారితో పాటుగా నా మకాం కూడా మార్చాల్సిందేనని తెలిసాక, నేను



సూచనలననుసరించే జరిగాయి.

నరసింహంగారిని చూస్తూ 'ఈ ఏర్పాట్ల గొడవలాంటి ఎటువంటి తలనొప్పులూ ఏం లేకుండా ఎంత నెమ్మదిగా ఉన్నారో...' హడావుడిగా పనులు చూసుకుంటూనే మధ్యమధ్యలో అమ్మగారు అలా విసుక్కోవటమూ జరుగుతోంది. అయన పెదవుల మీద చిన్న చిరునవ్వు వెలుగుతూనే ఉంది!

అమ్మగారిని అంత హుషారుగా మా ఊరు వచ్చినప్పుడు నేనెప్పుడూ చూడలేదు! ఇంటిని అలంకరించటం, స్నేహితులతో పార్టీలు మాత్రమే కాకుండా పండుగల ముస్తాబులు, పేరంటాలు లాంటివీ అమ్మగారికి ఇష్టమైన కాలక్షేపాలేననీ నాకూ అప్పుడే అర్థమైంది !

నరసింహంగారు, అమ్మగారూ కూడా రెండు రకాలైన వ్యాపకాలతో బిజీగా ఉండి పోతే, నేనూ అంతే... నరసింహంగారి ప్రసంగ పాఠాలు తయారుచేయటం... నా ముఖ్యమైన విధి. ఊరుకు వెళ్ళినా, ఎక్కువ సమయం గడపటానికి అవకాశం ఉండేదికాదు. అమ్మకూడా ఉండమని బలవంతపెట్టకుండా వెళ్ళమనేది.

వీరేంద్ర కుటుంబంతో మా ఇంటిదగ్గరే ఉండిపోవటంతో, అమ్మ ఒంటరిగా వుందనే భావన లేకుండా నేనూ నిశ్చింతగా నరసింహంగారితో ఉండిపోగలుగుతున్నాను.

అక్కడికి వెళ్ళాక నాలోనూ ఏదో మార్పు వచ్చినట్లనిపించింది! పరిసరాల ప్రభావం ఉంటుందనుకుంటా. మునుపు అమ్మగారు అక్కడికి వచ్చినపుడు... నాకెందుకోగానీ వారి తీరు తెన్నులు అంతగా నచ్చేవి కావు.

ఇప్పుడు అలా అనిపించటం లేదంటే... కారణం ఏమై ఉంటుంది...? ఆమె గారు ఈ ఊళ్ళో ఉన్నప్పుడు... ఎంతో హుషారుగా, నవ్వుతూ తుళ్ళుతూ ఉంటారు...! మన చుట్టూ ఉండేవారిలోని ఉత్సాహం, ఉల్లాసం... మనలోకీ ప్రవహిస్తుందేమో మరి!

శుభగారి పెద్దమ్మ మనవరాలట... ఒకమ్మాయి... ఆ సంవత్సరమే డిగ్రీలో చేరిందనుకుంటా, అప్పుడప్పుడూ వస్తూండేది. ఒక్కోసారి రెండు రోజులుండిపోయేది కూడా. ఆరోజు నేను డైనింగ్ టేబుల్ దగ్గరకు టిఫిన్ ప్లేటుతో వచ్చేసరికి ఆ అమ్మాయి కూర్చుని తింటోంది. నేను మామూలుగా తలవంచుకుని తినటంలో నిమగ్నమై ఉన్నాను. ఆ అమ్మాయి

అనుకుంటున్నాడా అని అనుమానం! అలా అయితే సులభంగా అమ్మాయిలు ప్రేమలో పడిపోతారన్నట్లుగా కొన్ని సినిమాల్లోనూ చూపిస్తుంటారుగా...!'

'చాల్లేవే... నీ అల్లరి...!' అంటూ ఆ అమ్మాయిని కసిరి నావైపు చూస్తూ ఓ సలహా ఇచ్చారు... 'ఏమయ్యా... వింటున్నావా...? నవ్య వాళ్ళ పెద్దవాళ్ళు ప్రేమ, దోమ లాంటి వాటికి అస్సలు ఒప్పుకోరు...! నువ్వలాంటి ఆశలేం పెట్టుకోకు.

ఏదో... నేను ఆ రోజుల్లో కాబట్టి... పెద్దవాళ్ళ మాటలకు తలొగ్గి... ఆ పల్లెటూరుకి కోడలుగా వెళ్ళాను. అయినా అక్కడ ఉండలేకపోయి... నా ఇంటికి నేనే చుట్టంగా మారా! ఏదో మానాన్న ఇచ్చిన ఇల్లు ఈ ఊళ్లో ఉండబట్టి బతికిపోయాను. పిల్లాడిని చదివించుకుంటూ ఇన్నాళ్ళూ ఎలాగో కాలక్షేపం చేసాను.

ఇన్నేళ్ళ తర్వాత ఇప్పటికి... ఈ మాత్రం వైభోగం దక్కింది! మీ అయ్యగారు ఆ పల్లెటూరుని పట్టుకుని వదలటంలేదు... ఆ ఊరి జనమే సర్వస్వం అయిపోయారని చిరాకు పడ్డాను. ఇన్నేళ్ళకి రాజకీయాల్లోకి వచ్చి ఓ మంచి పనిచేశారు... పదవి దక్కించుకున్నారు. నాలా అందరూ ఇలా ఓర్పుగా ఉండగలుగుతారా...? మా గడుగ్గాయి నవ్య అయితే, పెళ్ళి కాన్సిల్ అని చెప్పి వెంటనే పరుగెట్టుకొచ్చేస్తుంది...!'

నవ్య వెంటనే 'ఏంటక్కా..వాళ్ళ ఊర్లు..మనం నిలబడలేనంతగా అలా ఉంటాయా...?' అనడిగింది.

'ప్చ్....' అంటూ అమ్మగారు నిట్టూర్చారు.

'నీకింకా అర్థంకాలేదా... ఏదో ఒకటి రెండు రోజులు ఆ ఊళ్ళో ఉండాలంటేనే, నాకు ముళ్ళమీద నిలబడినట్లుండేది! మా అత్తారిల్లు అయితే పేరుకి మేడ అయినా పాతవాసన! అక్కడి మనుష్యులు కూడా ఈసురోమంటూ పనులు చేసుకోవటానికే పుట్టామన్నట్లుగా ఉంటారే బాబూ... ఇక ఇతగాడి ఇల్లు గురించయితే చెప్పేందుకేముంటుంది...!' అంటూ మళ్ళీ నిట్టూర్చారు.

'అబ్బా... అలా ఒక్కముక్కలో తేల్చేశావేంటక్కా... ఇతని ఇల్లు ఎలా ఉంటుందో ఓ రెండు మాటలు చెప్పొచ్చుగా....! అంటూ ఫక్కున నవ్వింది.